# కోరిరావులుగారి బస్ కండక్టర్

**దీపావళి ఇక మూడు వారాలుండనగా బాలవరంలో టీచరుగా చేరిన అనంతలక్ష్మికి రొంపజ్వరంలాగా వచ్చింది. ఆ మధ్యాన్నం కురిసిన వర్షంలో తడుస్తా స్కూలునించి కొత్తగా దిగిన ఇంటిదాకా వచ్చిందేమో రాత్రయ్యేసరికి ఆ జ్వరం బాగా పెరిగింది. అటు పక్క ముసురూ ఇటు పక్క జ్వరం వారంరోజులు పాటు వదల్లేదు.**

జ్వరం తగ్గి మంచం మీంచి లేచిందిగానీ ఊపిరి తీసుకోడం కొంచెం కష్టంగానే ఉంది.

రెండు వారాలయినా అలాగే ఉండేసరికి రాజమండ్రిలో ఉన్న వాళ్ళ తాలూకు వాళ్ళని రమ్మని కార్డు రాసింది.

తడిసిన నేల ఆరేదాకా నాల్రోజులు ఎండకాసిందో లేదో గానీ మళ్ళీ పట్టుకుంది వర్షం. తుఫానట. ఆరాత్రి,

జల్లు కొడ్తుంటే కిటికీల రెక్కలు మూసేసి చిడతలు బిగించి వచ్చి బొంతమీద పడున్న అనంతలక్ష్మి లోపలికి చాలా గట్టిగా లాక్కోవాల్సి వస్తుంది ఊపిరి. ఆ రాత్రంతా ఒకటే యాతన... నరకమే.

తెల్లవారింది.

రాజమండ్రి నించి వచ్చిన అనంతలక్ష్మి పిన్ని మావయ్యా చెదిరిన బొంతమీద పడున్న అనంతలక్ష్మిని చూసి నానా హైరాణా పడిపోయారు. ఆదరాబాదరా ముఖం కడిగించి బట్టలు కట్టింది వాళ్ళ పిన్ని. బయటికొచ్చి ఎర్రకంకర్రోడ్డు మీదాగిన బస్సెక్కించి ''దేవుడా తొందరగా రాజమండ్రి జేర్చు మమ్మల్ని'' అనుకున్నాడు మావయ్య.

కానీ, రాజానగరం దగ్గరపడే లోపే చిట్టడివిలాంటి ఆ ప్రదేశం మధ్యలో ఆగిపోయింది బస్సు. పంక్చరయ్యిందట. కొత్త డ్రైవరు టైరు మార్చడం సరిగ్గా రాదట వాడికి. కండక్టర్‌తో నానా అవస్థా పడ్తున్నాడు. వాళ్ళ తీరు చూసిన పాసింజర్లు గ్యారంటీగా ఒక గంటపైన పడద్ది అనుకున్నారు.

ఊపిరాడ్డం కనా కష్టం అయిపోతున్న అనంతలక్ష్మి సీట్లోవేళ్ళాడబడిపోతుంది. అది చూసిన అనంతలక్ష్మి మావయ్య కొయ్యబారిపోయేడు.

పిన్ని గొంతులో చిన్న ఏడుపు చార బయటికొస్తూంది. వాళ్ళ పరిస్థితి చూసిన పాసింజర్లు తొందరగా ఏ లారీ అన్నా వస్తే బాగుండ్ను పాపం అనుకుంటున్నారు.

అంతలో, చాలా స్పీడుగా వచ్చాగింది కోరిరావులుగారి బస్సు.

కాకీనిక్కరూ చొక్కా డిప్పక్రాపుతో చంకలో జేగురుమట్టి రంగుతోలు బేగ్‌తో బస్సులోంచి ఉరికిన కండక్టర్ భద్రం ''ఏంటమ్మా ఏవయిందీ?'' అన్నాడు.


జరిగింది చెప్పేరు.

వెంటనే అనంతలక్ష్మిని తన బస్సులోకి షిఫ్ట్ చేసేసి డ్రైవర్‌తో ''ఒరేయ్ సత్తిపండూ రాజమండ్రి వచ్చేలోపల ఎక్కడా ఆగకూడదు బండి. కళ్ళు మూసుకుని తెరిచేలోపల గవర్నమెంటు హాస్పిటలు ముందుండాలి మనం'' అని ఆర్డరేశాడు భద్రం.

చిన్నచిన్న ఊళ్ళలో జనం ఆపమని చేతులూపుతున్నారు. పొలికేకలేస్తున్నారు అలాగే బస్సులోంచి దిగేవాళ్ళుకూడా చాలా గొడవ చేస్తున్నారు. కానీ, ఎక్కడా ఆపడం లేదు బస్సు. ప్రతిరోజూ బలభద్రపురంలో ఎక్కి రాజమండ్రిలో దిగే అరవయ్యేళ్ళ గంగరాజు "ఒరేయ్ భద్రం ఒక్క సెకండన్నా ఆపరా పాపం ఎక్కేవాళ్లు ఎక్కి, దిగేవాళ్లు దిగుతారు" అన్నాడు.

"ఆ పిల్లనలా చూస్తాగూడా ఎలా అనగలుగుతున్నావ్ సత్తిరాజు మావా" అన్నాడు తప్ప బండిని మట్టుకి ఆపలేదు.

స్పీడు స్పీడుగా వెళ్తున్నబస్సులో రెండు వర్గాలు



తయారయ్యాయి. బస్సు ఆపాలనీ ఒకళ్ళు, ఆడకూతురు పరిస్థితి తెల్సికూడా ఆ ముక్క ఎలా అనగలుగుతున్నారని ఇంకొకళ్ళు.

వాళ్ళూ వీళ్ళూ దెబ్బలాడుకునే లోపే రాజమండ్రీ గవర్నమెంటు హాస్పటల్ ముందాగింది బస్సు.

అనంతలక్ష్మిని హాస్పటల్లో జేర్చి ఆక్సిజను సిలెండర్ పెట్టేదాకా అక్కడే ఉండి ఆమెకేం పర్లేదు అని డాక్టరు అన్నాక "బస్టాండుకి పోనియ్‌రా సత్తి పండూ" అన్నాడు.


గోపాల్రావు గారి కాఫీ హోటలుదగ్గర నిలబడున్న కోరిరావులు మూడుగంటలు లేటుగా వస్తున్న బస్సు నాపి "ఏంట"న్నాడు.

పూస గుచ్చినట్టు జరిగింది చెప్పేడు డ్రైవరు సత్తి పండుగాడు.

కోపంతో ఊగిపోయిన కోరిరావులు భద్రాన్ని పచ్చిబూతులు తిట్టి ''ఏరా నువ్వు దేశ సేవ చెయ్యడానికి నా బస్సే దొరికిందిరా దగుల్బాజీ నా కొడకా, నా కొంప గుండం జేస్తున్నావ్ గదరా. ఈసారిలాంటి పని చేసేవంటే మెళ్ళగుళ్ళు ఇరిచేస్తాను. సొక్కాసెడ్డీ ఇప్పి మా ఊరి పుంతరేవులో ముంచేస్తాను... ఎదవనాకొడకా'' అని డ్రైవర్ని పిల్చి ''ఒరేయ్ పండుగా ఈడితో సావాసం చెయ్యకు. ఈడి గోరోజనం నీకు అంటుకోకుండా జూసుకో'' అన్నాడు.

* * *

మొత్తం పసుపూ అక్కడక్కడా ఎరుపు రంగులేసున్న కోరి రావులు గారి బస్సు పేరు



అరుణా బస్ సర్వీసు. మా కాలవ దగ్గర ఆగే చాలా బస్సుల్లాగ దీనిది కూడా కోటిపల్లి రాజమండ్రి రూటేగానీ ఇది మాచవరం వంతెన దిగి ద్వారపూడి మీంచి రాజమండ్రెళ్ళకుండా రాయవరం దాటి బలభద్రపురం, రాజనగరం మీంచి వెళ్తుంది రాజమండ్రి.

ఆవేళ, ద్రాక్షరామం బోసు బొమ్మ దగ్గర బస్సు ఆగగానే గేలాపెత్తుకు వచ్చిన ఓ మనిషి ''ఇదిగో భద్రం బావా! మణుగునెయ్యిడబ్బా టాపు మీద పెట్టించేను. మా పెదనాన్నగారబ్బాయి బడుగు చంద్రయ్య తెల్సు గదా బస్టాండు కొస్తాడు కొంచెం ఆడికి అప్పగించెయ్యిరా బాబూ'' అనేసెళ్ళిపోయేడు.

పాపం ఎంత అవసరమో ఏంటో అనుకున్న భద్రం ''అలాగేలే బావా'' అన్నాడు.

రామచంద్రపురం రామకృష్ణాహోటలు దగ్గర బస్సు ఆగీ ఆగకండానే కురస గౌనేసుకున్న అయిదేళ్ళ పిల్ల నెత్తుకొచ్చిన ఒకావిడ ''ఇదిగో భద్రం అన్నయ్యా! వీళ్ళ నాన్నారు బస్టాండు కొస్తారు. నీకు చెప్పక్కర్లేదనుకో బిడ్డ జాగ్రత్తేం. ఏ రాయవరం దగ్గరన్నా ఆకలని ఏడుస్తుందేమో బిడ్డ ఏ బిస్కోతో పేలాలో కొనిపెట్టు'' అని రూపాయి బిళ్ళిచ్చి వెళ్ళిపోయిందామనిషి.

నవ్వుతా ఆ పిల్లని తీసుకెళ్ళి తన సీట్లో కూర్చో బెట్టుకుని కేవులు తీసుకుని టిక్కెట్లు కొట్టే పన్లో పడిపోయేడు భద్రం.

బలభద్రపురం రోడ్డు పక్కనే ఆగడంతోటే భుజం మీదున్న గళ్ళ తువ్వాలుతో ముక్కు తుడుచుకుంటా లోపలికొచ్చిన గంగరాజు ''ఏంట్రా బద్రిగా ఇవ్వాళ్ళెన్ని ఎప్పాసు బేరాలు ఒప్పుకున్నావ్?'' అన్నాడు.

''వాళ్ళేదో చిన్న చిన్న సాయాలు నన్ను చెయ్యమన్నారు పాపం. ఆ మాత్రంకూడా చెయ్యకపోతే మనమెందుకు గంగరాజు మాయ్యా?'' అన్నాడు భద్రం.

''నీలాంటోళ్ళు అప్పనంగా చేస్తుంటే ప్రతిరోజూ పురమాయిస్తూనే ఉంటార్రా'' అన్నాడు గంగరాజు.

''పాపం ఆళ్ళు ఎన్ని అవస్థల్లో ఉన్నారో ఏంటో మాయ్యా...రైట్... రైట్'' అనరుస్తుంటే నవ్వుతా భద్రాన్ని చూసిన గంగరాజు ''నీలాంటోళ్ళు ఎప్పుడో ఎక్కడోగానీ పుట్టర్రా బద్రిగా... నువ్వు మాకు దొరకడం నిజంగా మా ప్రాంతం వాళ్ళ అదృష్టం రా'' అన్నాడు.

దూసుకుంటా పోతుంది బస్సు. మబ్బులు పట్టేసి ఉంది ఆకాశం. ఈదురుగాలికి చాలా చలిగా ఉంది.

బస్సు రాజానగరం వెళ్ళేసరికి మొదలైన వర్షం ఇష్టమొచ్చినట్టు బాదుతా ఉంది.

కోటిపల్లి బస్టాండ్ దగ్గర బస్సు ఆగగానే దిగిన గంగరాజు ''లాస్ట్‌బస్సు టైము కొచ్చేస్తానొరేయ్'' అనేసి తడుస్తానే వెళ్ళి ఆగున్న రిక్షాలోకి దూరిపోయాడు.

అంతా దిగేసేరు. దాక్షారామంలో టాపు మీదేసిన నెయ్యి డబ్బావాళ్ళుగానీ, రామచంద్రపురంలో ఎక్కిన పిల్ల తాలూకోళ్ళుగానీ, మాచవరంలో వేసిన పెండలం బట్టలోళ్ళుకానీ, రాయవరం స్టాండులో వేసిన కందుల బస్తా మనుషులుకానీ రాలేదు. భద్రం ఇంటికాడ జేరేస్తాడన్న నమ్మకంతో, ఒక్క మనిషికూడా రాలేదు.

''సరే'' అనేసి భద్రం నవ్వుకుంటుండగా ఏడుపు లంకించుకుంది పిల్ల.

ఆ పసిదాని కళ్ళల్లో నీళ్లు చూసి ఇట్టే కరిగిపోయిన భద్రం ఏడవకమ్మా ముందు మీ ఇంటికే వెళ్దాం అనేసి కిందికి దిగి కడియం జామికాయలూ, మొక్కజొన్నపొత్తులూ కొని పెట్టి ''పోనియ్యరా సత్తిపండూ'' అన్నాడు.

అన్నిచోట్లకీ తిరిగి అందరికీ అన్నీ అప్పగించి తిరిగి బస్టాండ్లోకి రావడానికి రెండు గంటలుపైనే పట్టింది.

''పట్టిసీమ దగ్గర గోదాట్లో కోసు రోడ్లున్నాయంట గదొరే భద్రం'' బస్సుని వెనక్కి తిప్పుతా అడిగేడు సత్తిపండు.

''ఔనటరా'' అన్నాడు భద్రం.

''ఒకో కోసు రోడ్డు దగ్గరా గోదారి నాలుగు తాడిచెట్ల లోతుంటదటగదా?'' మళ్ళీ అడిగేడు పండుగాడు.

''ఉంటదట... ఔనూ... ఇయిన్నీ నన్ను అడుగుతున్నావేంటి?'' డౌటొచ్చింది భద్రానికి.

''ఓనరుగారు ఇయ్యాళ నిన్ను కోసురోడ్డులో గాని ముంచేస్తారేమో అని భయంగా ఉంది మరి''.

''ఏడ్చేవ్‌లేగానీ టాప్ గేరెయ్యరా''. నవ్వేస్తా ఆడ్ని తిట్టేడు భద్రం.

* * *

రామచంద్రపురంలో తోటవారి వీధిలో లైబ్రరీ దగ్గరుంది భద్రం వాళ్ళిల్లు.

వయస్సు నలభై దాటినా పెళ్ళవ్వలేదు. వయసులో ఉన్నప్పుడు గాంధీ డాక్టరుగారి హాస్పిటల్లో వేణి అనే నర్సుని ఏళ్ళ తరబడి ప్రేమిస్తే ఒకరోజు అద్దం ఒకటి బహుమతిగా ఇచ్చిందా వేణి.

''అద్దం నాకెందుకు?'' అనడిగేడు భద్రం. ''మీ ఇంట్లో లేదేమోనని'' అంది వేణి.

''ఉందిగదా బిళ్ళారీ అద్దం'' అమాయకంగా అన్నాడు భద్రం.

''మరి ఉంటే ఎప్పుడన్నా అందులో మొకం చూసుకున్నావా... చూసుకునే ఉంటే నువ్వెలాగుంటావో ఈపాటికి అర్థమయ్యి ఉంటది గదా. నీ అందానికి నేను గావాల్సి వచ్చేనా ఎదవా?'' అనేసి నైటు డ్యూటీ కెళ్ళిపోయింది.

మనసుకి చాలా బాధేసింది. మళ్ళీ ఇంకెప్పుడూ ఏ లేడీసునీ ప్రేమించననీ కిషోర్‌టాకీస్ జంక్షన్‌లో ఉన్న రాములోరి గుళ్ళో దణ్ణవెట్టుకున్నాడు.

అదేంటో అప్పట్నుంచీ ఏ ఆడదాన్ని చూసినా అసహించుకోవాలి. ఇక్కడ భద్రం విషయం రివర్సు. ప్రతి ఆడమనిషినీ తల్లికిందా, తోబుట్టువు కిందా, చంటిబిడ్డకిందా చూస్తుంటాడు.

ఒంటరిగా ఆడమనిషినీ, చంటిపిల్లల్నీ, ముసలోళ్ళనీ ఊళ్ళకి పంపించాలంటే కోరిరావులు గారి బస్సులో భద్రం కోసమే చూస్తుంటారంతా. ఆ బస్సు ఎంత లేటుగా వచ్చినా సరే ఎదురు చూస్తానే ఉంటారు ఆవేళ రాకపోతే పోన్లెద్దూ రేపు వెళ్దాం అనేసి వాయిదా వేసుకుంటారు. భద్రం అంటే అంత నమ్మకం మరి.

* * *

బస్సు తొస్సిపూడి దాటి బలభద్రపురం వంతెన దిగువలో ఆగింది నెమ్మదిగా.

ప్రతిరోజూ ఆ బస్సుకోసం నిలబడే గంగరాజు ఆవేళ కనిపించలేదు.

ఇదేంటి చిత్రం? అనుకుని వాకబు చేస్తే గంగరాజు రాత్రి నిదట్లో పోయేడని తెల్సింది.

అంతే. ''మాగంగరాజు మావ పోయేడా'' అనేసి చంటికుర్రోళ్ళా నేల మీద దొర్లి ఏడ్చేస్తా ఎవరు ఎంత చెప్పినా వినకండా బస్సుని ఊళ్ళోకి పోనిమ్మన్నాడు సత్తిపండుగాడ్ని.

గంగరాజుమావ ఇంటిముందు బస్సాగ్గానే బోరుమని ఏడుస్తా దిగిన భద్రం పాడికట్టే వాళ్ళకి సాయం చేశాడు. శవానికి మంగలోడు గెడ్డం గీస్తుంటే మెడ దగ్గర చెయ్యాన్చి పట్టుకున్నాడు. శవ స్నానం చేయిస్తుంటే తనే నీళ్ళు గుమ్మరించేడు.

బస్సులో ఉన్న జనం ఎంత గోలపెడ్తున్నా వాళ్ళకేసి కన్నెత్తయినా చూడలేదు! శవాన్ని శ్మశానానికి తీసుకెళ్తుంటే తనుకూడా ఓ కొమ్ము పట్టాడు. మొత్తం తంతు పూర్తవ్వడానికి రాత్రయింది.

బస్సులో పాసింజర్లంతా మా పసలపూడిలో దిగిపోయి కోర్రావుల్తో చాలా పెద్ద గొడవే పెట్టుకున్నారు. కొందరయితే రామచంద్రపురం వెళ్ళి పోలీసు కంప్లయింటిచ్చేరు.

ఇక తట్టుకోలేకపోయిన కోరిరావులు ఉన్న పళాన రమ్మని భద్రానికి కబురెట్టేసరికి భోగం వాళ్ళ వీధి చివర్లో ఉన్న కోరిరావులుగారింటి పచ్చగేటు ముందుకొచ్చి నిలబడ్డాడు భద్రం. సీవండి గ్లాసుతో టీ పట్టుకొచ్చిన కోరిరావులుగారమ్మాయి విజయలక్ష్మి ''ఏంటీ ఇయ్యాల బస్సెక్కలేదా, రేపెళ్ళినప్పుడు తాపేశ్వరంలో దిగి వీసె కాజా ఒకటి తేవాలి నాకు'' అంది.

''అలాగే నమ్మలూ'' అని నవ్విన భద్రం టీ తాగబోతుండగా కొరడాకర్ర పట్టుకుని విసురుగా వచ్చిన కోరిరావులు కొట్టినచోట కొట్టకండా

చావకొట్టాడు భద్రాన్ని.

రావులు బయటికి తోలేశాకా చాలా బస్సుల్లో పనిచేసేడు భద్రం.

ఇలా,

ఎక్కడికెళ్ళినా ఇదే తంతు. దాంతో మధ్యాన్నానికే బయటికి తోలేస్తూ చివరికి ఏ బస్సు దగ్గరకెళ్ళినా వద్దు బాబోయ్ అని గోలెట్టేసేరు.

భద్రాన్నిచూసి జాలిపడి తనకొట్లో షోడాలు పట్టే పనికి పెట్టుకున్నాడు కిళ్లీకొట్టు మున్సబురెడ్డి. షోడాలు పట్టేటప్పుడు ఎండలో బస్సుకోసం నిల్చున్న పాసింజర్లలో ఏ ఒక్కడు దావతిగా ఉంది అన్నా షోడాకొట్టి ఇచ్చేస్తున్నాడు భద్రం. దాంతో పదిహేనురోజులు రావాల్సిన గేస్‌సిలెండరు రెండు రోజులకే కాళీ అయిపోయిది. అది చూసి గొళ్ళుమన్న మున్సబురెడ్డి ‘‘వెళ్ళరా బాబూ... నీ వల్ల నాకంతా బొక్కయిపోయేలాగుంది’’ అని తరిమేసేడు.

కాస్త పెద్ద ఎత్తునే వడ్డీ వ్యాపారం చేసే కుతుకులూరు రెడ్లు నమ్మకస్థుడనీ జెప్పి వాళ్ళ దగ్గర పెట్టుకుని బాకీలు వసూలు చేసుకురమ్మని లైను మీదికి పంపించేరు.

ఏడొందలు అప్పు కట్టాల్సిన ఒకడు భద్రం చేతిలో ఆ ఏడొందలూ పెట్టి రేపు చెల్లి పెళ్ళండి బాబూ చేతిలో చూస్తే పైసా లేదు అనేసి తన కష్టాలు చెప్పి భద్రాన్ని పట్టుకుని గొళ్ళున ఏడిస్తే, భద్రం వాడ్ని పట్టుకుని గొళ్ళు... గొళ్ళున ఏడ్చేసి ఆరోజు వసూలైంది రెండు వేలుంటే వాడి చేతిలో పెట్టి వట్టి చేతుల్తో తిరగొచ్చాడు.

దాంతో, ఆ ఉద్యోగమూ ఊడింది.

తణుకు అవతల ఉండ్రాజవరంలో కమ్మోళ్ళెవరో పెద్ద కోళ్ళ ఫారం ఒకటి పెట్టి కాపలాకి భద్రాన్ని పెట్టుకున్నారు.

ఒకరాత్రిపూట ఐరన్ మెష్ లోపల బందీలయ్యి ఉన్న కోళ్ళకేసి జాలిగా చూసి ఆ తర్వాత కన్నీళ్ళు పెట్టుకున్న భద్రం బందీలయిపోయి ఉన్న వీటికే స్వేఛ్ఛ ఉంటే ఎంత హాయిగా బతుకుతాయి అనుకుని ఫారంలోతలుపులు మొత్తం తీసేసి ఫారంలో ఉన్న కోళ్ళన్నిటినీ బయటి కొదిలేసేడు.

అది ఓనర్లకి తెల్సి అగులు గుద్దుకుంటూ వచ్చి పులుసులోకి ఎముకలేకండా చావబాది గెంటేసేరు.

అలా,

ఎక్కడ పనిలోకి చేరినా ఇదే వెంట. ఇదే గొడవ. ప్రవర్తనలో ఏ మార్పులేదు. తిండానికి తిండిలేని స్థితి కొచ్చినా ఏ మార్పూ రాలేదు మనిషిలో.

ఉన్నట్టుండి ఓరోజు మాయమైపోయిన మనిషి అంతూ అయిపూ లేకండా పోయాడు ఇప్పుడెక్కడున్నాడో ఏంటో..అసలున్నాడో లేడో...

* * *